క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



సీతారామపురం : మండలంలోని నెమళ్లదిన్నె, గంగవరం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ మస్తాన్‌వలి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. మూల్యాంకన పుస్తకాలను పరిశీలించారు. ప్రతిరోజూ అరగంట పాటు విద్యార్థులతో పుస్తక పఠనాన్ని విధిగా చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల చేతిరాతను పరిశీలించి తెలుగు గుణింతాలను సులభరీతిలో ఎలా నేర్పించాలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బీసీ కాలనీలోని రామాలయం వెనుకవీధిలో సీసీరోడ్డు నిర్మాణానికి పంచాయతీ అధికారులు బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షల అంచనా వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వారు తెలిపారు. స్థానిక నేతలు నరసారెడ్డి, పీఆర్ ఏఈ తిరుమలయ్య, సిబ్బంది మహిమ, మాధవ, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. బీఎస్సార్ ఐటీఐ ప్రిన్సిపల్ బీగాల ప్రకాష్, సంగం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ మురళీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 52 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రీన్‌టెక్, బ్లూస్టార్, టీవీఎస్, ఎల్క్రో స్టీల్, గోల్డ్‌ఫేజ్, యమహా, మారుతిసుజుకి, కిసాన్ క్రాఫ్ట్, డ్రోన్ టెక్నాలజీస్, తదితర సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రెండ్రోజుల్లో కాల్‌లెటర్లు పంపుతామని వారు తెలిపారు. ఐటీఐ కళాశాలల సిబ్బంది ఎస్ సుధీర్, కృష్ణయ్య, బాదుల్లా, సుస్మిన్, శోభ, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా పేలుడు ఘటనపై కేసు నమోదు

ఉదయగిరి: అప్పసముద్రంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా చోటు చేసుకున్న బాణసంచా పేలుడు ఘటనకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై కే ఇంద్రసేనారెడ్డి బుధవారం తెలిపారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న బొమ్మినేని విష్ణువర్ధన్, మద్దినేని మధు, బొమ్మినేని వెంకటాద్రినాయుడు, మద్దినేని మాలకొండయ్య, ఇరిగినేని ప్రసాద్, బూరగ రమణయ్య, వాకా వెంగళరెడ్డి, ఇరిగినేని చినరత్తయ్యతో పాటు మరి కొందరిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. మండలంలో పోలీసుల అనుమతి లేకుండా ఉత్సవాలు, శుభకార్యాల సందర్భంగా బాణసంచా కాలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నల్లగొండ్ల క్షేత్రం అభివృద్ధికి సహకరించండి



వింజమూరు: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను వింజమూరు మండలానికి చెందిన ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. నల్లగొండ్లలోని లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం అభివృద్ధికి సహకరించాలని కోరారు. నల్లగొండ్ల క్షేత్రం అభివృద్ధికి సంబంధించి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పంపిన రూ.48 కోట్ల డీపీఆర్ ఆమోదించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఓబుల్‌రెడ్డి తెలిపారు.

కోడిపందేలపై దాడులు

ఆత్మకూరు: మండలంలోని పడకండ్ల పొలాల్లో బుధవారం సాయంత్రం కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆత్మకూరు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.1100 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదరులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై జిలానీ తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారీ ఏదీ?

- నిర్వహణ లేక.. నిరుపయోగంగా సంపద కేంద్రాలు
- నెరవేరని స్వచ్ఛ పంచాయతీల లక్ష్యం



నిరుపయోగంగా తిమ్మారెడ్డిపల్లిలోని సంపద తయారీ కేంద్రం

వరికుంటపాడు: మండలంలోని పలు పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా పంచాయతీలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు చెత్తను సంపదగా మలచడం ద్వారా వాటి ఆదాయాన్ని పెంపొందించే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం కింద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను మంజూరు చేసింది. అందులో భాగంగా మండలంలోని 24 పంచాయతీలకు గానూ 22 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం కేంద్రాలను నిర్మించారు. ఇందుకోసం సుమారు రూ.1.50 కోట్లు వెచ్చించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంపద కేంద్రాలను తూతూ మంత్రంగా నిర్మించి బిల్లులు స్వాహా చేయడంతో కేంద్రాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. గ్రీన్‌అంబాసిడర్ల ద్వారా ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించాలి. తడి చెత్తను వర్మికంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించాలి. తద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాల్సి ఉంది. అయితే మండలంలో ఎక్కడా ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదు. స్వచ్ఛభారత్‌లో భాగంగా చెత్త సేకరణకు కేటాయించిన వాహనాలు, సైకిళ్లు నిరుపయోగంగా మారాయి. మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉన్నా సేకరించిన చెత్తను విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనున్న శ్మశానంలో పడేస్తున్నారు, వర్మికంపోస్టు తయారీ కోసం నిర్మించి తొట్లలో పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. సంపద కేంద్రంలో బోరు వేసినా మోటార్ బిగించలేదు. తిమ్మారెడ్డిపల్లి పంచాయతీకి ఇద్దరు గ్రీన్‌అంబాసిడర్లు ఉన్నారు. రెండు చెత్త సేకరణ వాహనాలు ఉండగా అందులో ఒకటి మరమ్మతులకు గురవడంతో నిరుపయోగంగా వదిలేశారు. మిగిలిన వాహనంతోనే చెత్త సేకరణ చేపడుతున్నారు. పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్స్ వస్తున్నా చెత్త సేకరణ వాహనానికి మరమ్మతులు చేయించడం లేదు. గ్రీన్‌అంబాసిడర్లకు సైతం ప్రతి నెలా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు మొక్కుబడిగా చెత్త సేకరణ చేపడుతున్నారు. సేకరించిన చెత్తను సైతం సంపద తయారీ కేంద్రానికి తరలించడం లేదు. దాదాపు ఇదే పరిస్థితి మిగిలిన పంచాయతీల్లోనూ ఉంది.



నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనం

ప్రతినెలా వేతనం ఇవ్వడం లేదు



తిమ్మారెడ్డిపల్లి పంచాయతీలో గ్రీన్‌అంబాసిడర్‌గా పనిచేస్తున్నా. నాకు 9 నెలలు వేతన బకాయిలు రావాల్సి ఉంది. కానీ నాలుగు నెలలకు మాత్రమే బిల్లు పెట్టారు. ఇంకా ఐదు నెలల జీతం రావాలి. చాలీచాలని జీతంతో కుటుంబం ఎలా బతకాలి. ప్రతి నెలా ఇస్తే కుటుంబ పోషణకు సరిపోతుంది.

– కంచుపాటి కృపయ్య, గ్రీన్‌అంబాసిడర్ తిమ్మారెడ్డిపల్లి

ఒక్క వాహనంతోనే చెత్తసేకరిస్తున్నాం



పంచాయతీకి చెత్త సేకరించేందుకు రెండు బండ్లు ఉన్నాయి. అందులో ఒకటి మరమ్మతులకు గురైంది. ఇంకో బండితోనే ఇద్దరం చెత్త సేకరిస్తున్నాం. జీతాలు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ప్రతి నెలా జీతం ఇవ్వాలి.

–మల్లె వెంకటయ్య, గ్రీన్ అంబాసిడర్, తిమ్మారెడ్డిపల్లి

కిలో పొగాకు గరిష్ట ధర రూ.320

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.320 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 465 బేళ్లను తీసుకురాగా, 341 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 124 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.320, కనిష్టంగా రూ. 110, సరాసరిన రూ.231.89 ధర పలికిందని వివరించారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 408 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 408 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 636 బేళ్లు రాగా, అందులో 408 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.320, కనిష్టంగా రూ.110, సగటున రూ.192.82 ధర పలికిందని వివరించారు.

సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సభ రేపు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సభను శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై వర్తమాన రాజకీయాల్లో ఏచూరి పాత్ర అనే అంశంపై ఉపన్యశిస్తారని చెప్పారు. పార్టీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

కొండాపురం: పంచాయతీల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు అన్నారు. మండలంలోని తూర్పుయర్రబల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుధ్యం నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించి వర్మికంపోస్టు తయారు చేసి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం బాగా లేదని ఫిర్యాదులు వస్తే పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి పథకం, పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



కరటంపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో బీటీఏ సభ్యత్వాన్ని అందజేస్తున్న బీటీఏ నాయకులు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిశీలించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదును బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. డీఏ బకాయిలు విడుదల చేయాలని, ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉరితాడులా ఉన్న జీఓ నంబరు 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరయ్య, రాజశేఖర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొండయ్య, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలను సత్వరమే పరిష్కరించాలి



సాయిపేట గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వంశీకృష్ణ

కొండాపురం: భూసమస్యలపై వచ్చిన రైతులను తిప్పుకోకుండా వెంటనే పరిష్కరించాలని కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర వంశీకృష్ణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. భూ సమస్యలపై వచ్చిన రైతులను వెంటనే న్యాయం చేయాలని సూచించారు. అనంతరం సాయిపేటలోని వివాదాస్పద భూమిని చూశారు. వాటర్‌ప్లాంట్ నిర్మాణం విషయంలో ఇరువర్గాల మధ్యన నెలకొన్న భూసమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్, ఆర్ఐ మణిదీప్, వీఆర్వోలు కొండయ్య, శ్రీనివాసులు, తదితరులున్నారు.

వివాదాస్పదంగా సీసీరోడ్డు నిర్మాణం



కంపను తొలగిస్తున్న సర్పంచ్

అనుమసముద్రంపేట: మండలంలో చౌటభీమవరంలో బుధవారం చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. గ్రామానికి చెందిన తెల్లదాండ్ల పద్మ 30 ఏళ్ల క్రితం ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని పక్కా డాక్యుమెంట్లతో కొనుగోలు చేసింది. అయితే సర్పంచ్ లక్ష్మినరసయ్య సదరు స్థలం పంచాయతీకి చెందిందని బుధవారం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇది తెలుసుకున్న పద్మ తన ఇంటి స్థలం వద్ద సీసీరోడ్డుపై ముళ్లకంపను అడ్డుగా వేసింది. అయితే సర్పంచ్ ముళ్లకంపను బలవంతంగా తొలగించాడు. సీసీరోడ్డు నిర్మించిన ప్రాంతంలో ఇళ్లు ఏమీ లేవు, కేవలం రాజకీయ కక్షతోనే తన ఇంటి స్థలంలో సీసీరోడ్డు నిర్మించారని బాధితురాలు ఆరోపిస్తోంది. కాగా గ్రామంలోని టీడీపీలో రెండు వర్గాలు ఉన్నాయి. ఒక వర్గం పద్మకు మద్దతు ఇస్తుండగా, మరో వర్గంలో సర్పంచ్ ఉన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే తన స్థలం పంచాయతీకి చెందినదంటూ సర్పంచ్ రోడ్డు నిర్మాణం చేపట్టారని, ఇది ఎంత వరకు న్యాయమని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు పద్మ తహసీల్దార్‌ను ఆశ్రయించింది. అయితే తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించి ఈ ప్రాంతంలో రెవెన్యూ మార్కింగ్‌లో రోడ్డే లేదని తెలిపారు. 30 ఏళ్ల క్రితం స్థలాన్ని కొనుగోలు చేసినందున అప్పట్లో రెవెన్యూశాఖ ఎటువంటి రోడ్డు మ్యాపింగ్ చేయలేదన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



ఉదయగిరి రూరల్: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ–1 టీ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని రేడియన్స్ ప్రైవేట్ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. గణితం, విజ్ఞానశాస్త్రంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు వారి తరగతికి తగ్గ సామర్థ్యాలు కలిగి ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట కరస్పాండెంట్ షేక్ మసూద్ ఉపాధ్యాయులు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

వరికుంటపాడు: మండల కేంద్రమైన వరికుంటపాడులోని మెయిన్ రోడ్డులో పారిశుధ్య పనులను బుధవారం చేపట్టారు. డ్రైనేజీల్లోని వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కూడలి వద్ద విద్యుత్ స్తంభాలకు అడ్డంగా పెరిగిన కరతుమ్మ చెట్లను తొలగించారు. సర్పంచ్ దిలీప్‌కుమార్ పారిశుధ్య పనులను పరిశీలించి సూచనలు చేశారు. వరికుంటపాడు పంచాయతీ పరిధిలో తాగునీరు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి సమస్యలు ఉంటే ప్రజలు వెంటనే పంచాయతీ కార్యదర్శి లేదా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

నగదు విత్‌డ్రా చేసి లెక్క పెడుతుండగా..

- లాక్కెళ్లిన దుండగుడు
- సీతారామపురంలో ఘటన



ఫుటేజీని పరిశీలిస్తున్న బ్యాంక్ సిబ్బంది

సీతారామపురం: ఓ మహిళ బ్యాంక్‌లో నగదు విత్‌డ్రా చేసి లెక్క పెట్టుకుంటూ బయటకు వస్తోంది. ఒక్కసారిగా దుండగుడు డబ్బును లాక్కెళ్లిన ఘటన సీతారామపురంలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగసానిపల్లెకు చెందిన నీలి విజయమ్మ కెనరా బ్యాంక్‌లో రూ.13 వేలు విత్‌డ్రా చేసింది. నగదును లెక్కపెట్టుకుంటూ బయటకు వస్తోంది. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి హఠాత్తుగా ఆమె చేతిలోని డబ్బును లాక్కొన్నాడు. బ్యాంక్ సిద్ధం చేసి ఉంచుకున్న మోటార్ బైక్‌పై ఉడాయించాడు. మహిళ డబ్బును గట్టిగా పట్టుకోవడంతో రూ.5 వేలను ఆ వ్యక్తి ఎత్తుకెళ్లాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా వారు బ్యాంక్ వద్దకు చేరుకుని సిబ్బందితో కలిసి సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు.

చాకలి ఐలమ్మకు నివాళి



వరికుంటపాడు: చాకలి వీరనారి ఐలమ్మ వర్ధంతిని వరికుంటపాడులో బుధవారం నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు మాచర్ల గురవయ్య ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజక సంఘ నాయకులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం గడీల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి ఐలమ్మ రజకుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం రజకుల ఆత్మగౌరవాన్ని గుర్తించి ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు యాదగిరి హజరత్, చిలకపాడు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్వర్లు, ట్రెజరర్ యాదగిరి ప్రసాద్, జనరల్ సెక్రటరీ యాదగిరి తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

ఉదయగిరి రూరల్: గండిపాళెం మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు సావిత్రి, మహాలక్ష్మమ్మ టీకాల ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వరకు చిన్నారులకు టీకాలు వేయించడం ద్వారా బిడ్డలకు ఏడు ప్రాణాంతక వ్యాధులు సోకకుండా చూసుకోవచ్చని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సీతారామపురంలో ఉపాధ్యాయులకు సత్కారం



దుత్తలూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో..

సీతారామపురం : మండల విద్యా వనరుల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు షేక్ రంతుజానీ, భోగ్యం శ్రీనివాసులను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, దేవిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్, సీతారామపురం బిట్–1 మాజీ ఎంపీటీసీ సభ్యులు రామిశెట్టి తిరుపతయ్య శాలువాలతో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఫజిహా, ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

దుత్తలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందిని బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కే రమణమ్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బందిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి..

వింజమూరు (ఉదయగిరి) : వింజమూరులోని ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న నేపథ్యంలో సహచర ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఎంఈఓలు పీ రమేష్, మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా శాలువాలు, పూలమాలలతో హెచ్‌ఎంను సత్కరించి అభినందించారు.

మర్రిపాడు: పడమటినాయుడుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన మాగంటి సుబ్బయ్యను సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, విశ్రాంత హెచ్‌ఎం రామయ్య,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వింజమూరు: ఖాదర్‌బాషాకు సత్కారం



మర్రిపాడు: హెచ్‌ఎం మాగంటికి సత్కారం

బాధిత చిన్నారులకు న్యాయం చేయాలి



చిన్నారిని పరామర్శిస్తున్న నాయకులు

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో గాయపడిన చిన్నారులకు న్యాయం చేయాలని జాతీయ బీసీ సంఘం ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు అప్పసముద్రంలో బాధిత చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధి ద్వారా ఒక్కొక్కరికి రూ.2 లక్షలు సాయం ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. అప్పసముద్రంలో బెల్టు దుకాణాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విళపు లలితరామ్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులు, జిల్లా జనరల్ సెక్రటరీ రావులపల్లి వెంకటజ్యోతి, మహాగౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ చానల్ పరిశీలన

దగదర్తి : ఇటీవల దగదర్తి–రాచర్లపాడు చానల్ పనులపై మండల టీడీపీలోని ఇరువర్గాలు విమర్శలు చేసుకోవడం తెలిసిందే. కాలువ పనులను నాసిరకంగా చేపడుతున్నారని రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆరోపణలు చేయగా, మాలేపాటి కాలువను ఆక్రమించుకున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరితో పాటు పలురు నాయకులు విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఆరోపించారు. అంతేగాకుండా అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డీఆర్ చానల్‌ను తహసీల్దార్ పీ కృష్ణ సర్వే అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. కాలువను సాగునీరు వెళ్లకుండా ఆక్రమించుకోలేదని, కాలువ మిగులు భూమిని మాత్రమే సాగు చేసుకుంటున్నామని మాలేపాటి వర్గీయులు, ఆయకట్టుదారులు తహసీల్దార్‌కు తెలిపారు. దగదర్తి, చెన్నూరు, వెలుపోడు గ్రామాల్లోని వరద నీరు ప్రవహించేందుకు నిర్మిస్తున్న డీఆర్ చానల్ బ్రిడ్జిల ఎత్తు సరిపోదని, వరద నీటితో పొలాలు మునకకు గురవుతాయని మాలేపాటి వర్గం ఆరోపించింది. కాగా కాలువ పనులు సక్రమంగా జరుగుతున్నా కమీషన్ల కోసమే మాలేపాటి కాలువ నిర్మాణ పనులు నాసిరకంగా జరుగున్నాయని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని పమిడి రవికుమార్ చౌదరి వర్గీయులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా వర్షాలు సమీపించేలోగా దగదర్తి–రాచర్లపాడు చానల్ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



అల్లూరు : అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

వింజమూరు(ఉదయగిరి)/ ఉదయగిరిరూరల్/ అల్లూరు: రైతులు పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ ఏ వాసు అన్నారు. గుండెమడకలలోని రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించాలని రైతులకు సూచించారు. అలాగే ఉదయగిరి మండలం కొండాయపాళెంలో ఏఓ విజయభాస్కర్ ఈక్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. అలాగే అల్లూరు మండలం గ్రద్దగుంటలో ఏడీఏ నాగరాజు సేంద్రియ సాగుపై అవగాహన కల్పించారు.